# మెరిసిన

## సూపర్ సిక్స్‌కు యువ భారత్

### శ్రీలంకపై ఘన విజయం. ఐసీసీ మహిళల అండర్-19 ప్రపంచకప్




కౌలాలంపూర్: ఐసీసీ మహిళల అండర్-19 ప్రపంచకప్‌లో యువ భారత్ జోరు కొనసాగుతోంది. లీగ్ దశలో గురువారం శ్రీలంకతో ఆఖరి మ్యాచ్ ఆడిన టీమ్ ఇండియా.. 60 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. గత రెండు మ్యాచ్‌లలో మాదిరిగానే బౌలర్లు చెలరేగడంతో లంక బ్యాటర్లు బెంబేలెత్తారు. భారత్ నిర్దేశించిన 119 పరుగుల ఛేదనలో లంక అమ్మాయిలు నిర్ణీత ఓవర్లలో 58/9 పరుగులకే పరిమితమయ్యారు. ఈ టోర్నీలో ఇప్పటిదాకా మూడు మ్యాచ్‌లు ఆడిన భారత్ (వెస్టిండీస్, మలేషియా, శ్రీలంక).. ప్రత్యర్థిని కనీసం 60 పరుగుల మార్కును కూడా దాటనీయకపోవడం విశేషం. ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన భారత్‌ను లంక బౌలర్లు కట్టడి చేయడంతో భారత్.. 20 ఓవర్లలో 118/9 పరుగులు చేసింది. యువ ఓపెనర్, తెలంగాణ అమ్మాయి గొంగడి త్రిష (44 బంతుల్లో 49, 5 ఫోర్లు, 1 సిక్స్) మినహా మిగిలిన బ్యాటర్లు చతికిలపడ్డారు. సహచర బ్యాటర్లు వెనుదిరుగుతున్నా లంక బౌలర్లను త్రిష సమర్థంగా ఎదుర్కొని విలువైన పరుగులు రాబట్టింది. మిథిలా (16), జోషిత (14), కెప్టెన్ నికీ ప్రసాద్ (11) రెండంకెల స్కోరును దాటారు. బౌలింగ్‌కు అనుకూలించిన పిచ్‌పై భారత బౌలర్లు కూడా చెలరేగడంతో లంక విలవిల్లాడింది. ఆ జట్టులో రష్మిక సెవ్వండి (15) మినహా అందరూ సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. పరుణిక (2/7), షబ్నమ్ (2/9), జోషిత (2/17), వైష్ణవి (1/3) మెరవడంతో లంక పూర్తి ఓవర్లు ఆడినా లక్ష్యం దిశగా సాగలేదు.

**సూపర్ సిక్స్‌లో..**

లీగ్ దశలో ఆడిన మూడింటికీ మూడూ గెలిచిన టీమ్ఇండియా.. గ్రూప్-ఏలో 6 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. సూపర్ సిక్స్‌లో భారత్.. ఈనెల 26న బంగ్లాతో,28నస్కాట్లాండ్‌తో తలపడుతుంది.

# ఆ నలుగురు.. 12 పరుగులు

**రంజీ రీఎంట్రీలో రోహిత్, పంత్, గిల్, జైస్వాల్ అట్టర్ ఫ్లాప్**

**మెరిసిన రవీంద్ర జడేజా**

ముంబై: అంతర్జాతీయ క్రికెట్‌లో పేలవ ఆటతీరుతో ముప్పేట విమర్శల దాడిని ఎదుర్కొంటూ 'తప్పనిసరి పరిస్థితుల్లో' దేశవాళీకి మళ్లిన భారత స్టార్ క్రికెటర్లు.. తమ రంజీ రీఎంట్రీలోనూ దారుణంగా విఫలమయ్యారు. తొమ్మిదేండ్ల తర్వాత ముంబై తరఫున రంజీ మ్యాచ్ ఆడిన రోహిత్ శర్మ.. తన వైఫల్యాన్ని కొనసాగిస్తూ 3 పరుగులకే వెనుదిరిగాడు. రోహిత్‌తో పాటు జైస్వాల్ (4), పంజాబ్ సారథి గిల్ (4), ఢిల్లీకి ఆడుతున్న రిషభ్ పంత్ (1) కలిపి చేసింది 12 పరుగులే. జమ్ముకశ్మీర్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో ఉమర్ నజీర్ బౌలింగ్‌లో పుల్‌షాట్ ఆడబోయిన రోహిత్ రెండో వికెట్‌గా వెనుదిరిగాడు. ఇదే జట్టులో మరో ఇద్దరు స్టార్ బ్యాటర్లు శ్రేయస్ అయ్యర్ (11), శివమ్ దూబె (0)లదీ అదే కథ. జమ్మూ పేసర్లు ఉమర్ నజీర్ (4/41), యుద్ధ్‌వీర్ సింగ్ (4/31) ధాటికి ముంబై గజగజ వణికి 120 పరుగులకే ఆలౌట్ అయింది. జమ్ము బౌలర్ ఉమర్ స్వింగ్‌జోరుకు ముంబై బ్యాటర్లు పూర్తిగా తేలిపోయారు. పుల్వామాకు చెందిన ఈ 31 ఏండ్ల బౌలర్ బంతిని రెండు వైపులా స్వింగ్ చేస్తూ అదరగొట్టాడు. 12 ఏండ్ల క్రితం ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో అడుగుపెట్టిన ఈ ఆరడుగుల బౌలర్ అనతికాలంలోనే జాతీయ స్థాయికి ఎదిగాడు. మరోవైపు కర్నాటకతో జరిగిన మ్యాచ్‌లో గిల్‌తో పాటు ఆ జట్టు బ్యాటర్లంతా చేతులెత్తేయడంతో పంజాబ్ 55 పరుగులకే కుప్పకూలింది. కానీ సౌరాష్ట్రకు ఆడుతున్న టీమ్ఇండియా సీనియర్ స్పిన్నర్ రవీంద్ర జడేజా (5/66) ఐదు వికెట్లతో సత్తా చాటాడు.



ఉత్తరాఖండ్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో గుజరాత్ బౌలర్ సిద్దార్థ్ దేశాయ్ 9 వికెట్లు పడగొట్టి అద్భుత ప్రదర్శన కనబరిచాడు.

# అర్జున్‌ను దాటేసిన గుకేశ్



ఢిల్లీ: భారత యువ గ్రాండ్ మాస్టర్, ఇటీవలే ప్రపంచ చాంపియన్‌గా అవతరించిన దొమ్మరాజు గుకేశ్ ఫిడే ర్యాంకింగ్స్‌లో నాలుగో ర్యాంక్‌కు చేరాడు. ఫిడే తాజాగా వెలువరించిన ర్యాంకింగ్స్‌లో గుకేశ్ 2,784 ఎలో రేటింగ్ పాయింట్స్‌తో నాలుగో స్థానంలో నిలిచాడు. కార్ల్‌సన్ (2832.5) అగ్రస్థానంలో కొనసాగుతుండగా నకముర (2,802), ఫాబియానో (2,798).. గుకేశ్ కంటే ముందున్నారు. టాటా స్టీల్ చెస్ టోర్నీ రెండో రౌండ్‌లో గెలిచిన తర్వాత గుకేశ్ ఒక ర్యాంక్ మెరుగుపరుచుకుని నాలుగో స్థానానికి ఎగబాకాడు. ఇన్నాళ్లు నాలుగో స్థానంలో ఉన్న అర్జున్ ఇరిగేసి (2,779.5) ఐదో ర్యాంక్‌కు పడిపోయాడు. భారత ర్యాంకింగ్స్‌లోనూ గుకేశ్.. అత్యుత్తమ ర్యాంకును దక్కించుకున్నాడు.

## తన్మయ్ శతకం

హైదరాబాద్, ఆట ప్రతినిధి: రంజీ ట్రోఫీ రెండో అంచె పోటీలలో భాగంగా హిమాచల్ ప్రదేశ్‌తో జరుగుతున్న గ్రూప్-బి మ్యాచ్‌లో హైదరాబాద్ జట్టు భారీ స్కోరు దిశగా సాగుతోంది. ఉప్పల్ రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ స్టేడియం వేదికగా గురువారం మొదలైన మ్యాచ్‌లో ఓపెనర్ తన్మయ్ అగర్వాల్ (272 బంతుల్లో 137 నాటౌట్, 14 ఫోర్లు) అజేయ శతకం సాధించగా అభిరాత్ రెడ్డి (73), రాహుల్ రాదేశ్(52) హాఫ్ సెంచరీలతో కదం తొక్కడంతో మొదటి రోజు ఆట ముగిసే సమయానికి హైదరాబాద్ 2 వికెట్ల నష్టానికి 291 పరుగులు చేసింది. తన్మయ్‌తో పాటు వరుణ్ (21 నాటౌట్) క్రీజులో ఉన్నారు. ఆకాశ్, అపూర్వ్ ఒక్కో వికెట్ తీశారు.

# మారథాన్ విన్నర్ ప్రసాద్

హైదారాబాద్, జనవరి 23 (నమస్తే తెలంగాణ) : సెక్రటేరియట్ అగ్నిమాపకశాఖ ఏడీఎఫ్ఓ జీవీ ప్రసాద్ ఇటీవల ముంబైలో నిర్వహించిన ప్రతిష్ఠాత్మక ప్రోకామ్ స్లామ్ 2024-25 మారథాన్ ఈవెంట్‌ను విజయవంతంగా పూర్తి చేసి టైటిల్ గెలిచారు. ఈ ఈవెంట్‌లో పోటీపడాలంటే కనీసం మూడు మారథాన్‌లలో ప్రతిభ చూపాలి. ఈ క్రమంలో జరిగిన టీసీఎ బెంగళూరు (10కి.మీ), వేదాంత ఢిల్లీ మారథాన్ (21కి.మీ), టాటా స్టీల్ కోల్‌కతా(25కి.మీ) ఈవెంట్లలో ప్రసాద్ సత్తాచాటారు. దీనికి కొనసాగింపుగా ఈనెల 19న ముంబైలో జరిగిన టాటా మారథాన్‌ను ఆయన విజయవంతంగా పూర్తి చేశారు. ఈ సందర్భంగా జీవీ ప్రసాద్‌ను డీజీ నాగిరెడ్డి సహా పలువురు ఉన్నతాధికారులు అభినందించారు.



**మహిళల సింగిల్స్ ఫైనల్‌లో అమీతుమీ**

# కీస్ X సబలెంక

## సెమీస్‌లో స్వియాటెక్‌కు షాక్ • ఆస్ట్రేలియన్ ఓపెన్



మెల్‌బోర్న్: సీజన్ తొలి గ్రాండ్‌స్లామ్ టోర్నీ అయిన ఆస్ట్రేలియా ఓపెన్‌లో మహిళల సింగిల్స్ ఫైనల్స్ బెర్తులు ఖరారయ్యాయి. హ్యాట్రిక్ టైటిల్ వేటలో ఉన్న డిఫెండింగ్ చాంపియన్ అరీనా సబలెంక.. టైటిల్ పోరులో అమెరికాకు చెందిన 19వ సీడ్ మాడిసన్ కీస్‌తో తాడోపేడో తేల్చుకోనుంది. టైటిల్ ఫేవరేట్లలో ఒకరిగా నిలిచి టోర్నీ ఆసాంతం దూకుడుగా ఆడిన పోలండ్ అమ్మాయి ఇగా స్వియాటెక్‌కు సెమీస్‌లో అనూహ్య షాక్ తగిలింది. కీస్‌తో హోరాహోరీగా జరిగిన పోరులో రెండో సీడ్ స్వియాటెక్.. 7-5, 1-6, 6-7 (8/10)తో పరాజయం పాలైంది. టోర్నీలో ప్రత్యర్థికి ఒక్క సెట్ కూడా కోల్పోకుండా సెమీస్‌కు చేరిన ఈ పోలండ్ భామకు కీస్ ఊహించని షాకులిచ్చింది. తొలి సెట్ మొదటి గేమ్ గెలుచుకున్న కీస్ కొద్దితేడాతో ఆ సెట్‌ను కోల్పోయినప్పటికీ ఆ తర్వాత బలంగా పుంజుకుంది. రెండో సెట్‌లో స్వియాటెక్ ఆటలు సాగలేదు. ఇద్దరు తలా ఓ సెట్ నెగ్గడంతో మ్యాచ్ నిర్ణయాత్మక మూడో సెట్‌కు దారితీసింది. చివరి సెట్‌లో ఈ ఇద్దరూ నువ్వానేనా అన్నట్టుగా పోరాడి మ్యాచ్‌ను టైబ్రేక్‌కు తీసుకెళ్లారు. ఇక టైబ్రేక్‌లో ఒకరికి మించి ఒకరు ఆధిపత్యం చెలాయిస్తూ ఒక్కో పాయింట్‌ను కూడగట్టుకుని విజయం దిశగా సాగారు. అయితే 8వ పాయింట్ తర్వాత వరుసగా రెండు పాయింట్లు దక్కించుకున్న కీస్.. ఏడేండ్ల సుదీర్ఘ విరామం (2017లో యూఎస్ ఓపెన్ ఫైనల్) తర్వాత గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఫైనల్‌కు అర్హత సాధించింది. ఆస్ట్రేలియా ఓపెన్ ఫైనల్ చేరడం ఆమెకు ఇదే తొలిసారి. మ్యాచ్‌లో కీస్ 7 ఏస్‌లు, 36 విన్నర్లు కొట్టింది. ఏడు డబుల్ ఫాల్ట్స్ చేసిన స్వియాటెక్.. 40 అనవసర తప్పిదాలతో మ్యాచ్‌ను చేజార్చుకోవడంతో ఆస్ట్రేలియా ఓపెన్ గెలవాలన్న తన కలను మరో ఏడాదికి వాయిదా వేసుకోవాల్సి వచ్చింది.

**హ్యాట్రిక్ టైటిల్‌కు అడుగు దూరంలో..**

మరో మ్యాచ్‌లో ఒకటో సీడ్ సబలెంక..6-4, 6-2తో బడోస (స్పెయిన్)ను ఓడించి ఈ టోర్నీలో వరుసగా మూడో సారి ఫైనల్ చేరింది. మొదటి సెట్‌లో వరుసగా రెండు గేమ్స్ గెలుచుకున్న బడోస ఆ తర్వాత జోరు కొనసాగించలేకపోయింది. ఆరంభంలో తడబడ్డా మ్యాచ్‌ను తన నియంత్రణలోకి తెచ్చుకున్న సబలెంక ఆ తర్వాత వెనుదిరిగి చూడలేదు. కాగా ఫైనల్‌లో గెలిచి సబలెంక హ్యాట్రిక్ సాధిస్తే.. మార్టినా హింగిస్ తర్వాత ఆస్ట్రేలియా ఓపెన్ టైటిల్‌ను 1997-99 తర్వాత వరుసగా మూడు సార్లు గెలిచిన తొలి మహిళా ప్లేయర్‌గా నిలుస్తుంది.



## వాంఖడే గిన్నిస్ వరల్డ్ రికార్డు

- 14, 505 బంతులతో అరుదైన ఫీట్

ముంబై: ముంబై క్రికెట్ అసోసియేషన్(ఎమ్‌సీఏ) అరుదైన ఘనత సొంతం చేసుకుంది. ఎన్నో చారిత్రక సందర్భాలకు వేదికైన వాంఖడే స్టేడియం గిన్నిస్ బుక్ వరల్డ్ రికార్డుల్లో చోటు దక్కించుకుంది. వాంఖడే నిర్మించి 50 ఏండ్లు పూర్తయిన సందర్భంగా ఎమ్‌సీఏ మొత్తం 14, 505 తెలుపు, ఎరుపు బంతులతో 'ఫిఫ్టీ ఇయర్స్ ఆఫ్ వాంఖడే స్టేడియం'అని ఇంగ్లిష్ వ్యాఖ్యాన్ని స్టేడియంలో తీర్చిదిద్దారు.




## క్వార్టర్స్‌లో సహజ

బెంగళూరు: ఐటీఎఫ్ టోర్నీలో భారత యువ టెన్నిస్ ప్లేయర్ సహజ యమ్లపల్లి సంచలనం సృష్టించింది. గురువారం జరిగిన మహిళల సింగిల్స్‌లో సహజ 6-1, 3-6, 6-1తో నాలుగో సీడ్ రష్యా ప్లేయర్ మరియా తిమోఫీవాపై అద్భుత విజయం సాధించి క్వార్టర్స్‌లోకి దూసుకెళ్లింది. రెండు గంటల పాటు సాగిన పోరులో తన(315) కంటే మెరుగైన ర్యాంక్‌లో ఉన్న మరియా(134)ను సహజ మట్టికరిపించింది.

## ముగిసిన భారత్ పోరు

జకర్తా: గత కొంతకాలంగా అంతర్జాతీయ వేదికలపై నిరాశపరుస్తున్న భారత షట్లర్లు మరోసారి తమ వైఫల్య ప్రదర్శనను కొనసాగించారు. ఇండోనేషియా మాస్టర్స్‌లో లక్ష్యసేన్‌తో పాటు సాత్విక్-చిరాగ్ జోడీ ప్రిక్వార్టర్స్‌లోనే ఓడటంతో ఈ టోర్నీలో భారత పోరాటం ముగిసింది. పురుషుల డబుల్స్‌లో భారత ద్వయం 20-22, 21-23తో కెద్రెన్-డెకపాల్ చేతిలో ఓడింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో క్వార్టర్స్ చేరిన తనీషా-ధ్రువ్ జంట 21-18, 15-21, 19-21తో పాంగ్ రౌన్ హో-సు యిన్ చెంగ్ చేతిలో చిత్తైంది. సింగిల్స్‌లో లక్ష్యసేన్ 16-21, 21-12, 21-13తో నిషిమొటో(జపాన్) చేతిలో పరాభవం పాలయ్యాడు. మిక్స్‌డ్ డబుల్స్‌లో తనీషా-పొన్నప్ప 21-13, 22-24, 18-21తో పీ కీ గొ-మె జింగ్ (మలేషియా) ద్వయానికి తలవంచింది.



హైదరాబాద్‌లోని బోడుప్పల్‌లో రహదారిని కమ్మేసిన పొగమంచు

# రాష్ట్రాన్ని కమ్మేసిన పొగమంచు

- యాదాద్రి జిల్లాలో వాగులోకి దూసుకెళ్లిన కారు
- పలు జిల్లాల్లో పెరిగిన చలి

హైదరాబాద్, జనవరి23 (నమస్తేతెలంగాణ): రాష్ట్రంలోని పలు జిల్లాల్లో గురువారం ఉదయం ఉష్ణోగ్రతలు దారుణంగా పడిపోయాయి. ఉదయం 8 గంటల సమయంలోనూ దట్టమైన పొగమంచు కమ్మేసింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. ఓ వైపు చలిగాలులు, మరోవైపు పొగమంచు ఉండటంతో ప్రజలు నానా అవస్థలు పడ్డారు. పొగమంచు కారణంగా యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలంలోని కాల్వపల్లి వాగులోకి కారు దూసుకెళ్లింది. అదృష్టవశాత్తూ అందులో ఉన్నవారికి ఏమి కాలేదు. హైదరాబాద్ శివారులోని పటాన్‌చెరులో 9.2 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. రాబోయే రోజుల్లో ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్ జిల్లాల్లోనూ 10 డిగ్రీలలోపే కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశమున్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.



యాదాద్రి భువనగిరి జిల్లాలోని పొట్టిమర్రి వద్ద వాగులోకి దూసుకెళ్లిన కారు

## వచ్చే నెల 15 తర్వాత పెరగనున్న ఎండలు

హైదరాబాద్, జనవరి23 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో రాగల మూడు, నాలుగు రోజుల పాటు పొగమంచు ప్రభావం ఉంటుందని వాతావరణ శాఖ సంచాలకురాలు డాక్టర్ నాగరత్న చెప్పారు. తూ ర్పు, ఆగ్నేయ గాలుల వల్ల పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని తెలిపారు. వచ్చే నెల 15 వరకు వాతావరణంలో భిన్న పరిస్థితులు ఉంటాయని వెల్లడించారు. ఫిబ్రవరి 15 తర్వాత వేడి తీవ్రత పెరుగుతుందని నాగరత్న చెప్పారు.



యూజీసీ నిబంధనలపై జరిగిన చర్చలో పాల్గొన్న సబితా ఇంద్రారెడ్డి, వినోద్‌కుమార్, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, సురభి వాణీదేవి, రావుల చంద్రశేఖర్‌రెడ్డి

# సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధం

- రాష్ట్రాల హక్కులు హరించేలా యూజీసీ కొత్త ముసాయిదా
- అమలైతే గవర్నర్ చేతిలోకి వర్సిటీ వీసీల నియామకం
- ఈ నూతన ముసాయిదాపై రాష్ట్రప్రభుత్వ వైఖరి ఏమిటి?
- మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి
- యూజీసీ వెబ్‌సైట్‌లో నేడు బీఆర్ఎస్ ఒపీనియన్
- బీఆర్ఎస్ నేత, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్

హైదరాబాద్, జనవరి 23 (నమస్తే తెలంగాణ): యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) కొత్త ముసాయిదా ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధంగా ఉన్నదని విద్యాశాఖ మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆక్షేపించారు. రాష్ట్రాల హక్కులను హరించే విధంగా ఉన్నదని విమర్శించారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో గురువారం బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, ముఖ్య నేతలు యూజీసీ కొత్త నిబంధనలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ చర్చల్లో సబితారెడ్డితోపాటు మాజీ ఎంపీ వినోద్‌కుమార్, ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ సురభి వాణీదేవి, మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి, డాక్టర్ దాసోజు శ్రవణ్, డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్‌రెడ్డి, ఒంటెద్దు నరసింహారెడ్డి, కార్పొరేషన్ మాజీ చైర్మన్లు జీ దేవీప్రసాద్, చిరుమళ్ల రాకేశ్, క్రిశాంక్, ఆంజనేయగౌడ్, గెల్లు శ్రీనివాస్ యాదవ్, దూదిమెట్ల బాలరాజ్‌యాదవ్, కేతిరెడ్డి వాసుదేవరెడ్డి, బీఆర్ఎస్వీ ఉపాధ్యక్షుడు తుంగ బాలు, బమ్మెర రామ్మూర్తి పాల్గొన్నారు. అనంతరం సబితారెడ్డి మీడియాతో మాట్లాడారు. యూజీసీ కొత్త నిబంధనల ప్రకారం.. యూనివర్సిటీ వీసీల నియామకాలు పూర్తిగా గవర్నర్ చేతిలోకి వెళ్తున్నదని, గవర్నర్ ద్వారా కేంద్రం పెత్తనం చేలాయించాలని చూస్తున్నదని మండిపడ్డారు. దీనిని బీఆర్ఎస్ వ్యతిరేకిస్తుందని స్పష్టంచేశారు. ఈ సిఫారసులను వ్యతిరేకించాలని రాష్ట్ర ప్రభుత్వా న్ని డిమాండ్ చేశారు. ఫెడరల్ స్ఫూర్తిని కేం ద్రం మంట గలిపితే ఊరుకోబోమని హెచ్చరించారు.

**రాష్ట్రాల హక్కులు హరించేలా..**

యూజీసీ ముసాయిదాపై సుదీర్ఘంగా చర్చించామని, 11వ క్లాజుల్లో చాలా వరకు రాష్ట్ర ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఉన్నాయని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ తెలిపారు. వీసీ, ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ నియామకాలతోపాటు హాజరు పద్ధతులపై రాష్ట్రాల హక్కులను హరించేలా ఉన్నాయని విమర్శించారు. బీఆర్ఎస్ అభిప్రాయాన్ని యూజీసీ వెబ్‌సైట్‌లో శుక్రవారం అప్‌లోడ్ చేస్తామని వివరించారు.

# ఆరు వర్సిటీల్లో ప్రొఫెసర్లు నిల్

- 12 విశ్వవిద్యాలయాల్లో 2060 ఫ్యాకల్టీ పోస్టులు ఖాళీ
- మొత్తం పోస్టులు 2817.. పనిచేస్తున్నది 757 మందే
- ఉస్మానియాలో 73 శాతం, కాకతీయ యూనివర్సిటీలో 80, బీఆర్ఏవోయూలో 100, జేఎన్టీయూలో 62 శాతం ఖాళీలు
- సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు
- తాజాగా ప్రభుత్వానికి ఉన్నత విద్యామండలి నివేదిక



హైదరాబాద్, జనవరి 23 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని యూనివర్సిటీలు బోధనా సంక్షోభంలో చిక్కుకున్నాయి. ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్ల కొరత, నిధుల లేమితో నిర్వీర్యమవుతున్నాయి. ఒకప్పుడు దేశంలో ఒక వెలుగు వెలిగిన మన విశ్వవిద్యాలయాలు నేడు ప్రభను కోల్పోతున్నాయి. రాష్ట్రంలోని 12 విశ్వవిద్యాలయాల్లో 2,817 పోస్టులకు గానూ 2,060 (దాదాపు 75 శాతం) ఖాళీలు ఉన్నాయి. 757 మంది మాత్రమే ఉన్నారు. దీంతో రోజురోజుకు విద్యాప్రమాణాలు దిగజారిపోతున్నాయి. ఉస్మానియాలో 73, కాకతీయలో 80, బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో 100 శాతం ఖాళీలు ఉండటం గమనార్హం. ఆరు యూనివర్సిటీల్లో ఒక్క ప్రొఫెసర్ కూడా లేరు. తాజాగా రాష్ట్ర ఉన్నత విద్యామండలి ప్రభుత్వానికి సమర్పించిన నివేదిక విశ్వవిద్యాలయాల్లో నెలకొన్న సంక్షోభ తీవ్రతను తేటతెల్లం చేసింది. ఉత్తరాది రాష్ట్రాల్లోని యూనివర్సిటీలు అటు పరిశోధన, ఇటు నాణ్యమైన విద్య అందిస్తూ రాణిస్తుండగా.. ఎంతో ఘన చరిత్ర కలిగిన మన విశ్వవిద్యాలయాలు సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయి. ఫ్యాకల్టీ కొరతతో విద్యా ప్రమాణాలు దెబ్బతింటున్నాయి. పరిశోధనల్లో విద్యార్థులు వెనుకబడిపోతున్నాయి.

**ఓయూలో 331 మందే..**

బోధనా సిబ్బంది లేక ఓయూ ప్రభ రోజురోజుకు మసకబారుతున్నది. ఓయూలో 1267 మంది బోధనా సిబ్బందికి గానూ 936 ఖాళీలు ఉన్నాయి. 331 మంది (27 శాతం) సిబ్బంది మాత్రమే ఉన్నారు. కాకతీయలో మొత్తం 55 ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మొత్తంగా 409 మంది సిబ్బందికి గానూ 79 మంది మాత్రమే పనిచేస్తుండగా ఏకంగా 330 పోస్టులు (80 శాతం) ఖాళీగా ఉన్నాయి. తెలంగాణ యూనివర్సిటీలో 3 ప్రొఫెసర్లే ఉన్నారు. మొత్తం 152 మందికి గానూ 61 మంది మాత్రమే ఉండగా.. 91 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మహాత్మాగాంధీ యూనివర్సిటీలో ఒక్క ప్రొపెసర్ కూడా లేరు. మొత్తం 70 మందికి గానూ 35 మంది మాత్రమే ఉన్నారు. శాతవాహన వర్సిటీ 16 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లతోనే నెట్టుకొస్తున్నది. పాలమూరులో మొత్తం 95 మందికి గానూ 18 మందే బోధిస్తున్నారు. పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీలో 55 పోస్టులు ఉండగా.. 8 మంది సిబ్బంది మాత్రమే ఉన్నారు. బీఆర్ఏవోయూ 86 మందికి గానూ 24 మంది మాత్రమే ఉన్నారు. జేఎన్టీయూలో 410 మందికి గానూ 152 మంది మాత్రమే సేవలందిస్తున్నారు. జేఎన్ఎఫ్ఏయూలో 55 మందికి గానూ 14 మంది మాత్రమే పనిచేస్తున్నారు. ఆర్జీయూకేటీలో 19 మంది సిబ్బంది మాత్రమే ఉన్నారు. చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీలో 25 మంది మాత్రమే ఉన్నారు. కాగా 179 మంది టీచింగ్ ఫ్యాకల్టీని మంజూరు చేయాలని అధికారులు ప్రతిపాదనలు సమర్పించారు.

**నివేదిక ఇవ్వని త్రిసభ్య కమిటీ**

రాష్ట్రంలోని కాకతీయ, మహాత్మాగాంధీ, శాతవాహన, పాలమూరు, పీఎస్‌టీయూ, ఆర్జీయూకేటీ యూనివర్సిటీల్లో అసలు ప్రొఫెసర్లే లేరు. అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్లతోనే బోధనను నెట్టుకొస్తున్నారు. అధికారంలోకి రాగానే యూనివర్సిటీలకు నిధులు పెంచుతామని, ఉన్నత విద్యను ప్రక్షాళన చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్.. ఏడాది గడిచినా ఆ దిశగా కనీస చర్యలు చేపట్టలేదు. యూనివర్సిటీల్లో నియామకాల కోసం ఉన్నత విద్యామండలి, వీసీల నుంచి ఒత్తిడి పెరగడంతో ఎట్టకేలకు నిరుడు డిసెంబర్ 13న అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వీసీ ఘంటా చక్రపాణి ఆధ్వర్యంలో ప్రొఫెసర్లు ఎం కుమార్, అల్తాఫ్ హుస్సేన్ సభ్యులుగా ఒక కమిటీని నియమించింది. నెల రోజులు దాటినా ఆ కమిటీ నివేదిక అందించలేదు. దీంతో ఇప్పటి వరకు పోస్టుల భర్తీపై ప్రభుత్వంలో ఎలాంటి చలనం లేదు. ఈ నేపథ్యంలో విద్యార్థులు రాష్ట్రంలో చదివేందుకు ఆసక్తి చూపడం లేదని విద్యారంగ నిపుణులు చెబుతున్నారు. ఎన్నికల్లో హామీ ఇచ్చినట్టుగా కాంగ్రెస్ పాలకులు వెంటనే స్పందించి ఉన్నత విద్యారంగం అభ్యున్నతిపై దృష్టిపెట్టాలని కోరుతున్నారు. లేకపోతే సామాజిక, శాస్త్రీయ రంగాల్లో వెనుకబడిపోవాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు.

| యూనివర్సిటీ | ప్రొఫెసర్స్ | అసోసియేట్ | అసిస్టెంట్ | వర్కింగ్ | ఖాళీలు |
|---|---|---|---|---|---|
| ఉస్మానియా | 147 | 53 | 131 | 331 | 936 |
| కాకతీయ | 0 | 2 | 77 | 79 | 330 |
| తెలంగాణ | 3 | 10 | 48 | 61 | 91 |
| మహాత్మాగాంధీ | 0 | 6 | 29 | 35 | 35 |
| శాతవాహన | 0 | 0 | 16 | 16 | 47 |
| పాలమూరు | 0 | 2 | 16 | 18 | 77 |
| పొట్టి శ్రీరాములు | 0 | 0 | 8 | 8 | 47 |
| బీఆర్ అంబేద్కర్ | 0 | 1 | 23 | 24 | 62 |
| జేఎన్టీయూ | 22 | 44 | 86 | 152 | 258 |
| జేఎన్ఎఫ్ఏయూ | 2 | 2 | 10 | 14 | 47 |
| ఆర్జీయూకేటీ | 0 | 0 | 19 | 19 | 129 |
| | | | | 757 | 2060 |

## యూజీసీ మార్గదర్శకాలను వ్యతిరేకిస్తున్నాం

- ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి

హైదరాబాద్, జనవరి 23 (నమస్తే తెలంగాణ): యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) మార్గదర్శకాలను వ్యతిరేకిస్తున్నామని తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి తెలిపారు. సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా యూజీసీ వ్యవహరిస్తున్నదని ఆక్షేపించారు. గురువారం మాసబ్‌ట్యాంక్‌లోని ఉన్నత విద్యామండలి కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలోని యూనివర్సిటీలకు నిధులివ్వకుండా యూజీసీ పెత్తనం చెలాయిస్తున్నదని ఆరోపించారు. ఇష్టానుసారంగా సంస్కరణలు తీసుకువచ్చి అమలు చేయాలని ఒత్తిడి తేవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. యూజీసీ నిబంధనలు అమల్లోకి వస్తే రాష్ట్రంలోని యూనివర్సిటీల వీసీల నియామకాల్లో రాష్ట్రాలకు ఎలాంటి పాత్ర ఉండబోదని తెలిపారు

## బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేసే వారిపై నిఘా

హైదరాబాద్, జనవరి 23 (నమస్తే తెలంగాణ): డబ్బు కోసం అమాయకులను బలి చేస్తున్న సోషల్ ఇన్‌ఫ్లూయెన్సర్లకు తెలంగాణ పోలీసుశాఖ ఎక్స్ వేదికగా వార్నింగ్ ఇచ్చింది. ఇన్‌ఫ్లూయెన్సర్లు ఇల్లీగల్, బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించింది. బెట్టింగ్, ట్రేడింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేయడం వల్ల అమాయకులు వాటికి బలవుతున్నారని, భారీగా డబ్బు పోగొట్టుకుంటున్నారని, మరికొందరు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, అలాంటి వాటిపై నిఘా ఉంటుందని పేర్కొన్నది.

Printed and Published by Damodar Rao Divakonda, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: Thigulla Krishna Murthy. Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.